# సన్మానపత్రం



**వై. వెంకట్రామయ్య**

మన్నుతిన్న పాములా వున్న త్రాచు పడగెత్తి బుస్సుమన్నది. భారీవర్షాలకు మట్టులనుండి, స్టోర్ రూములనుండి తేళ్లు బయట పడుతున్నాయి. చాలారోజుల తర్వాత గొర్రెపిల్లను చూసిన మృగరాజు జూలు విదిలించాడు. హేమంత ఋతువులో హైబర్నేషన్‌లో వున్న జంతువులు శిశిరంలో తలపైకెత్తి, చుట్టూ పరికించి, ఒక్కసారిగా బయటకు పరిగెత్తినట్టు, ఇన్నాళ్లా అజ్ఞాతవాసంలో ఉన్న నాయకులు బయటకు వస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని ఆంధ్రదేశంలో ఎక్కడ చూసినా కోలాహలం— పెళ్లిసందడిలా ప్రచారపు హడావుడి. అభ్యర్థుల చిహ్నాలు వివిధ భంగిమలలో ఆకర్షణీయమైన రంగులలో, అలంకారాలతో దర్శనమిస్తున్నాయి. ఏనుగుగుర్తుగల అభ్యర్థి అదృష్టవశాత్తూ అక్కడ నడుస్తున్న సర్కస్ కంపెనీ నుండి గజరాజుని తెప్పించి ఊరేగిస్తుంటే, సింహం గుర్తుగల అభ్యర్థి తెల్ల మొహం వేస్తున్నాడు.

ప్రజాసేవ చేయటానికి అవకాశం లభించలేదని బాధపడిపోతున్న నాయకులు, కష్టకాలంలో ధైర్యంగా గడపాలని, దాచిపెట్టిన డబ్బును విరజిమ్ముతున్నారు. అదృష్టాన్ని పరిశీలించుకుంటున్నారు. సైకిళ్లు, రిక్షాలు, లారీలు, టెంపోలు, ట్రాక్టర్లు, జీపులు, కార్లు— ఇవి అవి అననేల? అన్నిరకాల ప్రయాణ సాధనాలను ఉపయోగిస్తూ అతి నిరాడంబరంగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సంకుల సమరం సాగించారు! అప్పుడప్పుడు ప్రత్యర్థులను కొట్టించినా, అహింసా పద్ధతిలోనే ప్రచారంజరిగింది! గవర్నమెంట్ సారా కాలువలై ప్రవహించినా, పుణ్య బాపూజీ మాకు ఆదర్శమని అభ్యర్థులందరూ ప్రకటించారు!!! లోపాయికారిగా కులంపేరు చెప్పకొని భారత భావిపౌరులైన విద్యార్థులను, ఆదర్శమూర్తులయిన అధ్యాపకులను కూడా రణరంగంలోకి దింపినా, కులమతాలకు మేము అతీతులమని సగర్వంగా చాటి చెప్పారు!!!!

ఎలక్షన్లలో గెల్చిన తర్వాత వైకుంఠపాళీలు, దాగుడుమూతలు, 'టగ్—ఆఫ్—వార్'వంటి ఆటలు ఆడుకున్నారు. పంచాయతీ సర్పంచులు, సమితి ప్రెసిడెంట్లు, మున్సిపల్ ఛెయిర్మన్‌లు, జిల్లా పరిషత్ ఛెయిర్మన్లు, ఆంధ్రావనిపై అవతరించారు.

అమ్మయ్య! ఎలక్షన్లు అయిపోయాయి అనుకుందామంటే అంతకుమించి సన్మానకార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 'స్వోత్కర్షల స్వకుచ మర్దనాలు, సన్మానాల పరస్పర కుచమర్దనాలు' అన్న దిగంబరకవిని ఎక్కడున్నా వెదికి పట్టుకొని అతగానికి తప్పక సన్మానం చేయాలి!

సెప్టెంబర్ 2.

9వ తారీకు ఉదయం 9 గంటలకు మన మున్సిపల్ చైర్మన్‌గార్కి, వైస్—చైర్మన్‌గార్కి, కౌన్సిలర్లకు ఘనసన్మానం జరుగుతుంది టౌన్ హాలులో. శాసన సభ్యుడు బల్లి అప్పల్నాయుడు గారు అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథిగా ప్రపంచ ప్రఖ్యాత తెలుగు సినిమా హీరో మార్తాండరావుగారు పాల్గొంటారు— అంటూ ఆహ్వానపత్రికలు ప్రకటించాయి; మైకులు ఘోషించాయి.

సెప్టెంబర్ 9: సమయం 10 గంటలు

అలంకరించబడిన వేదికమీద సుఖాసీనులై ఉన్నారు మన శాసనసభ్యుడు బల్లి అప్పల్నాయుడుగారు, ఆయనకు అటు ఇటూ మున్సిపల్ చైర్మన్‌గారు, వైస్—చైర్మన్ గారు, ఆ తర్వాత కవి మారుతీచంద్రరావు గారు, ఆ వెనుక వరుసలో మిగతా సభ్యులు. ప్ర.ప్ర.తె.సి. హీరో గారు షూటింగ్‌లో ఉన్నా, కార్యక్రమం అయ్యే లోపల తప్పక విచ్చేస్తారని ముందే ప్రకటించారు. ఇద్దరు ఫోటోగ్రాఫర్లు హడావుడిగా తిరుగుతున్నారు. వేదిక చుట్టూ రంగు రంగుల బెలూన్లు— ఎన్నికల వాగ్దానాలలా— ఆనంద నాట్యం చేస్తున్నాయి.

సన్మాన కార్యక్రమం వేదపఠనంతో ప్రారంభమయింది.

ఓ శ్శాంతి శ్శాంతి శ్శాంతిః

అధ్యక్ష స్థానంలో ఉన్న శాసనసభ్యులు గారు అతి నాజూకైన పొందూరు ఖద్దరుదుస్తులలో వెన్నెలరేడులా వెలుగొందుతున్నారు. గిరీశానికి జందెంపోగు ఉపయోగపడినట్టు, ఈ ఖద్దరు దుస్తులు మన నాయకుల నిరాడంబర జీవితానికి అద్దంపడుతున్నాయి.

అధ్యక్షుల వారు లేచి చేతుల్లోకి మైకు తీసుకుంటున్నారు, తండ్రి పాపాయిని దగ్గరకు తీసుకుంటున్నట్టుగా. బొద్దుమీసాలతో పాటు గొంతు సవరించుకున్నారు.

కెమేరాలు క్లిక్ మన్నాయి. అప్పల్నాయుడుగారు ఉపన్యాసం మొదలుపెట్టారు.

"నమస్కారాలు. ఈ సన్మానం నాకు జరుగుతున్నట్టే ఉంది. పెళ్లి కొడుకుల్లా మన సేర్మన్‌గారు, వైస్సేర్మన్‌గారు, సభ్యులు ఉన్నారు. ఏటో, మేము గాంధీ గారి సిష్యులం. ఇంతకుముందెంచ్చన్లో నేనూ, సేర్మన్‌గారు బద్ద ఇరోదులం. ఈనాడు మేము ఫ్రెండ్సుము.

మన సేర్మన్‌గారు అజాత స్త్రెతువు. ఆయన

డబ్బెట్టి గెల్చారని గిట్టవోల్లంటారు. ఏ మనిసయినా, పైకి పోవాలంటే— ఆ పైకి కాదు— మూడుండాల. గురుతెట్టుకోండి ఒకటి, డబ్బుండాల. రెండు బుర్రుండాల. టాక్టుండాల. మూడు మంచిగా ఉండాల, అందర్ని మంచి సేసుకోవాల. మన సీర్మన్‌గార్కి ఆ మూడున్నాయి. ఆయన సంగసేవ సేత్తాడు. [టప్. టప్. రబ్బరు బూరలు పేలిపోతున్నాయి] ఆయన తెలివున్నవాడు. వేమన్న ఏటి సెప్పాడు. అదేదే ఇతరులను బాదపెట్టకుండా తప్పించుకు తిరిగేవాడు అనలా [టప్ టప్]. ఏటో ఒకటే టపటపలు... ఇక కవిగారు సీర్మన్‌గార్కి సన్మాన పత్తరం సదూతారు'.

కవి కులాలంకార మారుతీచంద్రగారు కళ్లజోడు సవరించుకున్నారు. సన్మానాంజలి చేతబట్టారు.

'సభాసదులకు నా అభివాదములు. నామీద ఓ అపవాదు వుంది— రాజకీయ నాయకులను ప్రశంసిస్తూ కవితలను వ్రాస్తానని. దీనిలో తప్పేముందో నాకర్థం కావడంలేదు. కనబడని, కరుణించని దేవతలకు స్తోత్రాలు చేయడం కంటె మనకు అప్పుడప్పుడు కన్పడుతూ, మన మొరలాలకించి వరాలిచ్చే మన శాసన సభ్యులు, ఛైర్మన్ గారి వంటి నాయకులపై కవితలు, కావ్యాలు వ్రాయటం ఆధునిక యుగ లక్షణమని నమ్ముతున్నాను. ముందుగా మన అధ్యక్షుల గారిపై ఆశువుగా చెప్తాను.

హాస్యానికి అధిపతి సిద్ధిగణపతి
మన అప్పల్నాయ్డుగారు బుద్ధికి బృహస్పతి
[అప్పల్నాయ్డుగారు మీసాలు మెలి తిప్పుతున్నారు]
తెల్లవారితే, ఆయన ఆప్తులకు ఇంద్రుడు,
చీకటిపడితే, తారల మధ్య చంద్రుడు
['కవిగార్కి పైత్యం పెరిగింది' అనుకున్నారు ప్రేక్షకులు]

చైతన్యం— సామాజిక చైతన్యం, స్పృహ— సామాజిక స్పృహ అని కొందరు గొంతుచించుకుంటున్నారు. కవిత్వమైనా, సాహిత్యమైనా ఆనందాన్ని కలుగచేయాలి. 'ఆనందో బ్రహ్మ' అన్నారు మనవారు. అనవసరమైన ఆలోచనలు రేకెత్తించి, యువకులను పెడదారి పట్టిస్తున్నారు కొందరు రచయితలు. సమాజం అంటే ప్రజలు. ప్రజలంటే మన అప్పల్నాయ్డుగారి వంటివారు, ఛైర్మన్ గారి వంటివారు. కనుక నేను నా కవిత్వంలో కీర్తిస్తున్నది ఎవరినో కాదు, ప్రజలనే. ఇదే ప్రజా కవిత.

మన ఛైర్మన్‌గారు భూస్వాముల కుటుంబంలో జన్మించారు. బ్రిటీషు వారి హయాంలో సుందర హర్మ్యాలలో, ఎండకన్నెరుగకుండా పెరిగారు. పెద్ద నగరాలలో విద్యనభ్యసించారు. స్వాతంత్ర్యం రాగానే 'భారత్ మాతాకీ జై' అంటూ ప్రజలలో కలిశారు. నడిస్తే కాళ్లు కందిపోతాయేమోనని ఆప్తులు బాధపడినా, భాస్కరుని ప్రచండ వేడిమి నెదుర్కొన్నారు విజయలక్ష్మిని చేపట్టారు.

ఇక అవధరించండి నా అభినందన గీతం
అసామాన్య, అసాధారణ వ్యక్తిత్వంగల ఓ మాననీయా
జయం! జయం!! విజయం! విజయం!!
దీనుల కభయం మీ విజయం!
ధనవంతుల లాకర్లలో దాక్కున్న సువర్ణం ఓ
విలువైన ఖనిజం
బేరర్‌బాండ్ల వంటి మీరు విజయం సాధిస్తారనేది
నిజం.
అంతరాలెరుగని అంతరంగంతో భాసిల్లు ఓ మహా
మనీషీ!
ఇన్నాళ్లూ లైట్లు వెలగక అంధేరా ప్రదేశ్‌లో ఉన్న
మా పురవీధులు
మీ పాలనలో అవుతాయి కళ్యాణ మంటపాలు,
కాంతి వీధులు.
కావాలి కావాలి మాకు మరో కాలేజీ
సీట్సు దొరక్క అవుతున్నారు స్టూడెంట్స్ లేజీ
అత్యంత ఆకర్షణీయం మీ పర్సనాలిటీ
అవుతుంది స్వర్గం మా మున్సిపాలిటీ
మల్లెపూవంటి మీ మనసు దొడ్డది
ఎట్టి పరిస్థితులనూ కాదది చెడ్డది
మీ మెడలో పూదండ
మీరే మాకు పెద్ద అండ
ఆస్తికులు, ఆస్తిపరులు అయిన మిమ్ములను ఆ
భగవంతుడు సర్వథా కాపాడుగాక!'

అలసిపోయిన కవిగారు చల్లని పానీయం సేవించి సేద తీర్చుకున్నారు.



## నలుపు

"మీరు నల్లగా ఉంటారు కదా? ఎర్రగా కన్పించడానికి మీరు తీసుకునే జాగ్రత్త ఏమిటి?"

"ఎపుడూ నా ప్రక్కన నాకంటే నల్లగా ఉండే చెలికత్తెను ఉండేలా చూసుకుంటాను".

అధ్యక్షుల వారు మైకుముందు మరల గొంతు సవరించుకున్నారు.


'నేను సెపుతూనే వుండ. మన కవిగారు— అదేదో పెబుత్వ పదవికి — ఆ— ఆస్తాన కవిగా పని కొత్తాడని.

ఏటా గుసగుసలు! పార్టీ మార్చాడు పార్టీ మార్చాడు అని గుసగుసలాడుతున్నారు. పార్టీ మార్చానంటే ఏటి! నా పార్టీ మర్చిపోలేదన్నమాట. అధికార పార్టీ అంటే ఏటి! అదిక సంకెలో పెజలు, మెచ్చి గెలిపిచ్చిన పార్టీ. నేను పెజల మనిషిని. కనుకనే ఇంకో పార్టీలో గెల్చినా నేను అధికార పార్టీలో సేరాను. నేనుమారినప్పుడు పెజలు అబ్బెంతరం సెప్పలేదుగా. వారికిట్టం నేకపోతే అదేదో గెరావ్‌లు, బోయ్‌కాట్లు సేసేవాళ్ల గందా! ఊహూ! అవేమీ లేవు. కందకులేని దురద కత్తిపీటకెందుకు అంట! కామన్‌సైన్సు ఏమని సెపుతూ వుంది? ఏటికి ఎదురీద కూడదు, పెవాహాన్ని బట్టి పోవాలని. అదే నేను సేసినా. అసలిది పార్టీ మారటం కాదు. ఇంట్లో అలిగి దూరంగా కాపురమెట్టినోడు సొంతింటికి రావడమన్నమాట... మీరు రాజకీయాలు సూత్తూనే ఉన్నారుగా. మన మేమన్నా సేయాలన్నా అప్పొజిసన్‌లో ఉంటే వీలుపడద్దా అనిలడుగుతున్నా... నేనేటో మాటాడుతున్నా. అక్కడ అసెంబ్లీలో అప్పొజిషనోళ్లు మాటాడనివ్వరు. ఇక్కడ లెచ్చరిద్దామంటే ఇదివరకటిలా కాదు— పజలు తెలివిమీరారు. ఉద్యోగాలకు, టాన్సఫర్లకు పరుగెత్తుకొస్తారు. ఎంత కర్చయినా ఫరవాలేదంటారు. ఆ తర్వాత అపొజిషనోళ్లని మంచి విమర్శ సేస్తారు. రాజకీయ నాయకులకు నీతి లేదంటారు. సర్లే. ఇదెప్పుడుండే బాగోతమే. రాజకీయాలంటే ఏటనుకున్నారు. ఎన్ని తిట్లు విన్నడ్డా దులిపేస్కుపోవాల. ఇప్పన మన సీర్మన్‌గారు వారి సందేహాన్ని విన్పిత్తారు.'

'అధ్యక్షుల వార్కి, వైస్—చైర్మన్‌గార్కి, కౌన్సిలర్లకు, మా ప్రియమైన ప్రజలకు మా అభివాదములు.

ఈ ఎలక్షన్లలో మేము పోటీ చేయడం కాకతాళీయం. బంధుమిత్రుల, అభిమానుల ప్రోత్సాహంతో ఈ రాజకీయాలలోకి దిగడం జరిగింది. కాలంమారిపోతూ ఉంది. మనమూ మారిపోవాలి.

ఇకపోతే, మీరు కోరినవి మనసులో పెట్టుకున్నాను. ఎన్నో సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరిగాయి. మున్సిపాల్టీ ఫండ్స్ ఏ స్థితిలో ఉన్నాయో తెలియదు. ఆ



నిషయాలను పరిశీలించి అవసరమయితే వైస్‌ఛైర్మన్ గారితో కలిసి, హైదరాబాద్ వెళ్లి, మన ప్రభువులతో మాట్లాడి తప్పక మన మున్సిపాల్టీ అభివృద్ధికై కృషి చేస్తామని హామీ ఇస్తున్నాను. మాకు ఘన విజయం చేకూర్చిన మా ఓటర్లందరికీ మా కృతజ్ఞతలు' మరల మరల జయజయ ధ్వానాలు.

ఇంతలో దూరంగా 'జై జై జై'లు. ప్రపంచ ప్రఖ్యాత తెలుగు సినిమా హీరో మార్తాండరావు గారు 'మధ్యందిన మార్తాండుని'లా జీపులో వస్తున్నారు. ముందు, వెనక లారీల నిండా అభిమాన సంఘాల వారు మైకులో ఎనౌన్స్ చేస్తున్నారు' మన హీరోగారు వచ్చేస్తున్నారు. దర్శనం చేసుకోండి'.


వచ్చిన హీరోగారు వేదికపై ఆసీనులయిన వారితో కరచాలనం చేశారు. అభిమానుల పూలదండలలో మునిగిపోయారు. కెమేరాలు క్లిక్ మంటుండగా, మన హీరో గారు ఏకపాత్రాభినయం చేస్తున్నారు. 'సభాధ్యక్షులయిన బల్లి అప్పల్నాయుడుగార్కి మా నమస్సుమాంజలులు. ఛైయిర్మన్ గార్కి, పెద్దలకు మా నమస్సులు. మా అభిమాన సంఘ సభ్యులకు మా ఆశీస్సులు.

ప్రజలారా, సోదర ప్రజలారా,

నేడు సుదినం. పర్వదినం. ఈ కార్యక్రమానికి మేము విచ్చేయడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఓ సినిమా షూటింగ్ సందర్భంగా అందాలు చిందే, భాగ్యాలు పండే ఈ కోనసీమకు— కాదుకాదు— ఈ కొబ్బరి సీమకు రావడం, ఈ సమయంలోనే ఛైర్మన్ గార్కి సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేయడం, మమ్ములను ఆహ్వానించడం దైవేచ్ఛగా భావిస్తున్నాం.

అరవై ఏళ్ల వయసులో ఇరవై ఏళ్ల అమ్మాయిలతో గంతులేమిటని కొందరు విమర్శిస్తారు. యువకులు యువకులుగా నటించడంలో గొప్ప ఏమున్నది? అలా కాక, ఈ వయసులో నవయువకుడిగా నటించి, మీ మన్ననలనందటంలోనే మాకు ఆనందమున్నది. నటన అంటే ఇదే కదా! ['హియర్, హియర్' అని అభిమానుల కరతాళ ధ్వనులు].

మాకంటె ఘనమైన నటులు మన అప్పల్నాయుడు గారి వంటి రాజకీయ నాయకులు. మేము ముఖాలకు రంగు పులుముకుని, వివిధ రకాల దుస్తులు ధరించి,




అందమైన అమ్మాయిల ప్రక్కన, రంగు రంగుల ఫిల్ముల సాయంతో మిమ్ములను మెప్పించగలుగుతున్నాము. ఎలాంటి మేకప్ లేకుండా మన నాయకులు తమ వాక్చాతుర్యంతో నిజంగా సోషలిజం వచ్చేస్తున్నదని ప్రజల్ని నమ్మించగలుగుతున్నారంటే వారి సామర్థ్యం అహో! ప్రశంసనీయం. ది పొలిటీషియన్స్ ఆర్ ద సేమ్ ఆలోవర్. దే ప్రామిస్ టు బిల్డ్ ఎ బ్రిడ్జి వేర్ దేరీజ్ నో రివర్. నదిలేకపోయినా, అయ్యారే! బ్రిడ్జి నిర్మిస్తామని రాజకీయ నాయకులు వాగ్దానాలు చేస్తారట. ]'భళా, భళా' అని చప్పట్లు]

ఛైర్మన్‌గారి గురించి మాకు ఎక్కువగా తెలియదు. మమ్ములను క్షమించవలె. వారికెంతో భవిష్యత్ ఉన్నది. ముందు ముందు— మరల పంచాయతీ ఎన్నికలు వచ్చేటట్లయితే ఇంకా పెద్ద పదవులనాశ్రయిస్తారని మా ప్రగాఢ విశ్వాసం. మరల మాకు షూటింగ్ వున్నది. మీ అనుమతితో సెలవు తీసుకుంటున్నాము'.

అభిమాన సంఘాల అధ్యక్షుల వారు దారి చూప, నినాదాలు మిన్నుముట్ట, ప్ర.ప్ర.తె.సి. హీరోగారు జీపు వైపు నడిచారు. జీపు కదిలింది. ఒకలారీ ముందు, ఒక లారీ వెనుక. తుఫాను వెలిసింది. తదుపరి కార్యక్రమం మెమోంటోల బహూకరణ.

చివరగా అధ్యక్షుల వారి తుది పలుకులు.

బల్లి అప్పల్నాయుడుగారు లేచి నిలబడ్డారో లేదో 'బూటకపు ఎన్నికలు డౌన్ డౌన్' అనే కేకలు, 'ఢాం ఢాం' అనే మోతలు మారుమోగాయి. అధ్యక్షుల వారితో సహా అందరూ కంగారుపడ్డారు— మనం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినా ఈ అపశృతులేమిటా అని అంగరక్షకులు అటూ ఇటూ పరుగెత్తారు. అసలు రహస్యం తెలిసింది. అధ్యక్షుల వారు ఒక నవ్వు నవ్వారు.

'ఏటి? అవి దీపావళి బాంబులా? అనుకుంటూనే ఉన్నా ఇదేదో ఆకతాయి కుర్రోళ్ల పనే అని. పేపర్లలో సూత్తూనే ఉన్నారుగా— నక్సలైట్లు నాటుబాంబులు తయారుచేస్తూ పట్టుబడ్డారని ఏటో, ఈ మధ్దెన సదూకునే కుర్రోళ్లు నక్సలైట్లవుతుండారు. లాభం నేదురా అబ్బాయిలూ, ఇంస మన దేసానికి పనికిరాదు అని సెపుతూనే ఉండా. పేపర్లో ఉన్నోళ్లకి పోలీసులు సాల్యూట్ సేత్తారు. ఇంతకుముందు నేను మరో పార్టీలో ఉన్నప్పుడు నా మనుసులు ఉన్నారు కాబట్టి సరిపోయింది. అబ్బాయిలూ, సదూకోండి. పైకివత్తారు. నేను సదూక పోయిన పైకి వచ్చినానంటే నేనెంత కట్టపడ్డాను, ఎంత కర్సుపెట్టాను, ఎంతమంది మనుసుల్ని సాకుతున్నాను.

సర్లే. ఈ ఉపన్నేసాలకి కడుపులు నిండుతాయా? విందు భోజన కార్యెక్రమం కూడా మీరు జెయపెదం కావించాల. ఆ ఇక వందన సమర్పన. ఎవరయ్యా వందనాలు సెప్పేది! రాండి. తొరగా లేటయి పోతున్నాది' అధ్యక్షుల వారికే కాదు, ప్రేక్షకులకు, కార్యక్రమ నిర్వాహకులకు ఓపిక అయిపోతూ వుంది.

వందన సమర్పణ నీరసంగా ముగిసింది.

అమ్మయ్య! ఈ సన్మాన ఉపన్యాసం పూర్తయింది.


* * * * * * * * * *

పాఠక మహాశయా! నవ్వుచుంటివా? పాశ్చాత్య విద్యా సంపర్కంతో నిత్యశంకితుడవైన నీకు ఈ సన్మాన వ్రత మహత్వమేమి తెలియును? స్త్రీల వ్రతకథల నెప్పుడును పఠించి యుండలేదా? ఫక్కున నవ్విన పార్వతీ పరమేశ్వరులు వ్రతమాచరించిన కన్యకు పతిదేవుని, శతసుత సంతానాన్ని ప్రసాదించి యుండలేదా? ఆగ్రహించిన శ్రీమహాలక్ష్మి వ్రత సమాప్తి కాగానే ధన కనక వస్తు వాహనాదుల నను గ్రహించి యుండలేదా?

కాలం మారినది, మనుషులు మారినారనుకొనుచుంటివా? తోలుబొమ్మలాటల స్థానే చలన చిత్రములు ప్రదర్శింపబడుటలేదా! మన కేతిగాడు, బంగారక్కలు వెండితెరపై మనకు దర్శనమిచ్చుటలేదా? వారి ద్వంద్వార్థ సంభాషణలతో, గేయములతో మన కాహ్లాదము కలిగించుటలేదా?

అనవాయితీగా వచ్చు ఈ వ్రతములను నేడు ఆధునికపద్ధతులలో ఆచరించుచున్నారు. అటువంటిదే ఈ సన్మానపత్రం! ఎవరయితే ఈ సన్మానవ్రత కార్యక్రమమును త్రికరణ శుద్ధిగా ఆచరింతురో వారికి రాజకీయ ప్రభువులు పర్మిట్లు, కోటాలు, లైసెన్సులు ప్రసాదింతురు గాక!!

శుభం భూయాత్



రంగు

"ఆ హీరోయిన్ తల్లికి ఉన్నట్టుండి ముసలితనం వచ్చిందేం?"

"హీరోయిన్ పెళ్ళిచేసుకొని వెళ్ళినప్పటి నుండి ఆవిడ తలకు రంగేయడం మానేసింది."

జి.చంద్రశేఖర్,